

## స్మార్ట్ సిటీ ప్రాజెక్టుల ద్వారా.. సామాజిక న్యాయం


8లో..

- పార్లమెంట్ లో ప్రశ్నించిన ఎంపీ డా.కడియం కావ్య
- సమాధానం ఇచ్చిన కేంద్ర మంత్రి తోఖాన్ సాహు


# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 05 | సంచిక : 015
పేజీలు : 08 | వెల: రూ.5/-
గురువారం
డిసెంబర్ 18, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net


# బీజేపీ.. ఫోర్త్ ప్లేస్




## పంచాయతీ పోరులో వాడిన కమలం

- ఓట్లు రాబట్టడంలో వెనుకంజ
- కాషాయాన్ని ఆదరించని పల్లె ప్రజలు
- మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్న నేతలు
- మేమే ప్రత్యామ్నాయం అన్నది ప్రకటనలకే పరిమితం
- కేవలం 5.5 శాతానికే బీజేపీ పరిమితం

రాష్ట్ర వ్యాప్తంగా మూడు విడతల్లో నిర్వహించిన పంచాయతీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ చతికిల పడింది. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ లకు మేమే ప్రత్యామ్నాయం అంటూ ప్రకటనలు చేస్తున్న బీజేపీ నేతలు పంచాయతీ ఎన్నికల్లో మాత్రం ఆశించిన మేర స్థానాల్లో విజయం సాధించలేకపోయారు. కనీసం మూడో స్థానంలో ఉండాల్సిన సంఖ్యలో కూడా సర్పంచ్ పదవులను గెల్చుకోలేక పోయింది. తెలంగాణలో 8 మంది ఎమ్మెల్యేలు, మరో 8 మంది ఎంపీలు ఉన్నప్పటికీ బీజేపీ పల్లెల్లో మాత్రం పట్టుకోల్పోయింది. స్వతంత్ర అభ్యర్థులు గెలిచిన సీట్లలో సగం మాత్రమే సాధించి ఘోర పరాభవాన్ని మూటగట్టుకుంది. దీంతో కాషాయ పార్టీ ఇప్పట్లో బలపడడం అసాధ్యమన్న భావన వస్తోంది. కమలం పార్టీ పట్టణాల్లో కొంత వరకు పట్టు సాధిస్తున్నప్పటికీ గ్రామాల్లో మాత్రం క్షేత్ర స్థాయిలోకి చొచ్చుకుపోలేక పోతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే బీజేపీ శ్రేణులు వచ్చిన సీట్లను చూసి మురిసిపోతూ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు. గతంతో పోల్చితే ఇప్పుడు ఆశించిన మేర సర్పంచ్ స్థానాల్లో విజయం సాధించినట్లు ప్రకటిస్తూ సంబరాలు చేస్తున్నారు. రానున్న రోజుల్లో పార్టీ మరింత బలపడుతుందన్న ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

–వరంగల్ వాయిస్ ప్రతినిధి



వివరాలు2లో..



## కటాఫ్ పదేళ్లు..

- జర్నలిస్టుల టూబీహెచ్ కేకు కొండా మురళీ సమ్మతి
- పాత్రికేయులతో మాటామంతి

వరంగల్ తూర్పు నియోజకవర్గం పరిధిలో పనిచేస్తున్న జర్నలిస్టులకు రెండు పడక గదుల ఇళ్లను ఇచ్చేందుకు మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీ అంగీకారం తెలిపారు. అయితే పది సంవత్సరాలుగా జర్నలిజంలో పనిచేస్తున్న వారిని ప్రామాణికంగా తీసుకొని జాబితా రూపొందించాలని సూచించారు. ఈ మేరకు సీనియర్ జర్నలిస్టులు చొరువ తీసుకొని జాబితా రూపొందించాలని పేర్కొన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కొండా మురళీ పాత్రికేయులతో మాటామంతి నిర్వహించారు.

80నుంచి 85 మంది మించకుండా జాబితాను తయారు చేయాలన్నారు. వీటితోపాటు అదనంగా పది మంది ఫొటో గ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు, 10 మంది సబ్ ఎడిటర్లకు అదనంగా ఇంటిని కేటాయిస్తానని హామీ ఇచ్చారు. అదే విధంగా వివిధ కారణాలతో మృతి చెందిన తూర్పు పరిధిలోని జర్నలిస్టు కుటుంబాలకు కూడా మానవతా దృక్పదంతో ఇండ్లను కేటాయిస్తానన్నారు. రెండు మూడు రోజుల్లో జాబితాను తయారు చేసి ఇస్తే దానిపై పూర్తి స్థాయి పరిశీలన చేశాక ఇండ్ల కేటాయింపు జరుగుతుందన్నారు. మంత్రి కొండా సురేఖ 15 రోజుల పాటు స్థానికంగా ఉంటున్నందున యుద్ధ ప్రాతిపదికన జాబితా ఇస్తే పరిశీలన త్వరగా పూర్తి అవుతుందన్నారు. జనవరిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ వస్తున్నందున సీఎం చేతుల మీదుగా జర్నలిస్టుల సొంతింటి కలను నిజం చేయనున్నట్లు ప్రకటించారు.

– వరంగల్ వాయిస్, కాశీబుగ్గ



3లో..

## బీజేపీ కార్యాలయాల ముట్టడి ఉద్రిక్తం

- ఈడీ వేధింపులపై కాంగ్రెస్ సమరభేరీ
- హనుమకొండలో భారీ ర్యాలీ




2లో..

## కాంగ్రెస్‌ను ప్రజలు విస్మరించారు

- అయినా బుద్ధి రావడం లేదు
- బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్



8లో..

## నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

- స్థలం లేని నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ లు
- దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- 38, 39 డివిజన్ లలో రూ.2.68 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

# బీజేపీ.. ఫోర్త్ ప్లేస్

- పంచాయతీ పోరులో వాడిన కమలం
- ఓట్లు రాబట్టడంలో వెనుకంజ
- కాషాయాన్ని ఆదరించని పల్లె ప్రజలు
- మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్న నేతలు
- మేమే ప్రత్యామ్నాయం అన్నది ప్రకటనలకే పరిమితం
- కేవలం 5.5 శాతానికే బీజేపీ పరిమితం



**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** పంచాయతీ పోరులో కమలం వాడిపోయింది. తెలంగాణలో ఎనిమిది మంది ఎమ్మెల్యేలు, మరో ఎనిమిది మంది ఎంపీలున్నప్పటికీ బీజేపీ పల్లెల్లో మాత్రం పట్టు సాధించలేకపోయింది. మూడు విడతల్లో జరిగిన ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులు గెలిచిన సీట్లలో సగం మాత్రమే సాధించి ఘోర పరాభవాన్ని మూటగట్టుకుంది. తొలి విడతలో దారుణంగా ఓటమిపాలైన బీజేపీ కేవలం 189 పంచాయతీ స్థానాలనే కైవసం చేసుకుంది. రెండో విడతలోనూ గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కేవలం 246 స్థానాల్లో మాత్రమే బీజేపీ మద్దతుదారులు విజయం సాధించగలిగారు. మూడో విడతలోనూ అదే సీన్ రిపీట్ అయింది. 264 సర్పంచ్ పదవులను బీజేపీ మద్దతుదారులు కైవసం చేసుకున్నారు. అయితే మొదటి, రెండో విడతలో కంటే మూడో విడతలో బీజేపీ కొంచెం మెరుగ్గా కనిపించింది. దీంతో మొత్తం మూడు విడతల్లో 12,702 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరుగగా 699 స్థానాల్లో బీజేపీ విజయం సాధించి కేవలం 5.5 శాతానికే బీజేపీ పరిమితమైంది.

### మూడు జిల్లాల్లోనే..

ఆదిలాబాద్, మంచిర్యాల, వరంగల్ మినహా మిగిలిన ఏ జిల్లాలోనూ బీజేపీ కనీసం పోటీ కూడా ఇవ్వలేకపోయింది. కేంద్ర మంత్రి బండి సంజయ్ నియోజకవర్గమైన కరీంనగర్‌తోపాటు ఎంపీ ఈటల రాజేందర్ గతంలో ప్రాతినిథ్యం వహించిన హుజూరాబాద్‌లోనూ బీజేపీ మద్దతుదారులు ఓటమిపాలవడం చర్చనీయాంశమైంది. మరో ఎంపీ రఘునందన్‌రావు ప్రాతినిథ్యం వహిస్తున్న మెదక్‌లో కనీసపోటీ ఇవ్వక పోవడంతో బిజెపి ఉనికి ప్రశ్నార్థకమైంది. బీఆర్ఎస్ పని అయిపోయిందని, ప్రత్యామ్నాయం తామేనని ఊదరగొట్టే బీజేపీ రాష్ట్ర నేతల మాటలు కేవలం ప్రకటనలకే పరిమితం అన్న విషయం పంచాయతీ ఎన్నికల ఫలితాలతో ఖరారైంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థికి కనీసం డిపాజిట్ కూడా దక్కలేదు. ఈ ఫలితాల నేపథ్యంలో పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ 30 శాతానికిపైగా ఓట్లు సాధించడం, ఎనిమిది సీట్లలో గెలుపొందడం గాలివాటమేనని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ముందుందు తెలంగాణలో ఆ పార్టీ ప్రభావం నామమాత్రమేని పేర్కొంటున్నారు.



### కాంగ్రెస్ ను విమర్శించడమే..

రాష్ట్ర బీజేపీలో మార్పు కానరావడం లేదు. అధికారంకోసం వెంపర్లాడడం తప్ప ప్రజల్లోకి చొచ్చుకుపోయేందుకు ప్రయత్నించడం లేదు. కొన్ని పట్టణాల్లో కొంత మేరకు పట్టు సాధించిన బీజేపీ వాపును చూసి బలుపు అన్నట్లుగా వ్యవహరిస్తోంది. కేవలం అధికార కాంగ్రెస్‌ను విమర్శించడమే లక్ష్యంగా పార్టీ ప్రస్థానం సాగుతోంది. ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నప్పటికీ చెప్పుకోదగిన రీతిలో రాష్ట్రానికి నిధులు రాబట్టడంలో విఫలమవడం పార్టీకి చెడ్డపేరు తెస్తోంది. గత పుష్కరకాలంగా ఇలాగే సాగుతున్నా పార్టీ నేతల్లో మాత్రం మార్పు రావడం లేదు. పక్క రాష్ట్రం ఏపీలో బీజేపీ నేతలు కేంద్రంతో అనేక పనులు రాబట్టుకుంటున్నారు.. ప్రాజెక్టులను సాధిస్తున్నారు. కానీ తెలంగాణలో కనీసం రోడ్లకు కూడా దిక్కులేదు. రాష్ట్రం ఏదైనా కోరితే కొర్రీలు తప్ప మరోటి కానరావడం లేదు.

### నాలుగో స్థానం..

పంచాయతీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ జోరు చూపించింది. మూడువిడతల్లోనూ సత్తా చాటి విపక్షాలపై స్పష్టమైన ఆధిక్యాన్ని కనబర్చింది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 12,702 గ్రామపంచాయతీలకు జరిగిన ఎన్నికల్లో 7,527 స్థానాల్లో గెలిచి చాంపియన్‌గా నిలిచింది. మూడు వేల సీట్లతో బీఆర్ఎస్ ఉనికి చాటుకోగా, బీజేపీ 699 స్థానాలతో సరిపెట్టుకుంది. స్వతంత్రులు 1,264 స్థానాల్లో విజయం సాధించారు. అయితే 1,264 మంది స్వతంత్రుల్లో 808 మంది కాంగ్రెస్ పార్టీ రెబల్ అభ్యర్థులు కావడం గమనార్హం. సర్పంచ్ గా బాధ్యతలు చెపట్టిన తర్వాత వీరంతా తిరిగి కాంగ్రెస్ పార్టీలే చేరడం ఖాయం. దీంతో కాంగ్రెస్ పార్టీ సర్పంచుల సంఖ్య 8,335 కు చేరుతుంది.

### ప్రధాని అసంతృప్తి..

ఇద్దరు కేంద్ర మంత్రులు, మరో ఏడుగురు ఎంపీలు ఉన్నప్పటికీ తెలంగాణ ప్రజలకు బీజేపీతో పెద్దగా లాభం కనిపించడం లేదు. అందుకేనేమో బీజేపీ పని తీరుపై ఇటీవల ప్రధాని మోడీ సైతం గట్టిగానే హెచ్చరించారు. మీ కంటే ఒవైసీ బెటర్ అంటూ బీజేపీ ఎంపీలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎనిమిది మంది ఎమ్మెల్యేలు, మరో ఎనిమిది మంది ఎంపీలతో బలమైన పార్టీగా ఉంటూ.. రాష్ట్రానికి ఎంతో చేయవచ్చు. అలాగే ఓబీసీ మోర్చా నేతగా మరో రాజ్యసభ ఎంపీ లక్ష్మణ్ కూడా ఉన్నారు. ఇంతమంది ఉన్నా బీజేపీ వెనుకబాటుకు కారణాలను విశ్లేషించడంలో విఫలమవుతున్నారు. ఇప్పటికైనా పార్టీ క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే తెలంగాణలో బీజేపీ ఎప్పటికీ అధికారంలోకి రాదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## చిట్యాల టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా రవీందర్



**వరంగల్ వాయిస్, చిట్యాల :** చిట్యాల మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు గంగాధర రవీందర్ ను చిట్యాల టౌన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నియమించారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రవీందర్ కు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బట్టు కర్ణాకర్, శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు కండువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు.

గురువారం చిట్యాల మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యుల సమక్షంలో ఈ నియామకం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మధు వంశీ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లకొండ కుమార్, మండల ప్రధాన కార్యదర్శి గడ్డం కొమురయ్య, మాజీ ఎంపీటీసీలు కట్కూరి నరేందర్, తిరుపతి, కొక్కుల సదానందం, కైతం మార్కండేయ, కొక్కుల రమేష్, ఆరేపల్లి నరసింహ రాములు, కిషన్, బుర్ర రాజుకుమార్, అల్లం రాజు, నరేష్, చిట్యాల మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌ను ప్రజలు విస్మరించారు

- అయినా బుద్ధి రావడం లేదు
- బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్

**వరంగల్ వాయిస్, శివనగర్ :** కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతి, డూప్లికేట్ గాంధీ కుటుంబ వారసుల అక్రమాలు బయటపడుతుంటే జీర్ణించుకోలేని కాంగ్రెస్ నేతలు మరో సారి ప్రజాస్వామ్యాన్ని ఖూని చేసేలా రాజ్యాంగాన్ని విస్మరిస్తూ ఇలా బీజేపీ కార్యాలయల వద్దకు వచ్చి దాడులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవి కుమార్ పేర్కొన్నారు. కాంగ్రెస్ నేతలు 70 ఏళ్లు పాలించి, దేశాన్ని పూర్తిగా అవినీతి మయం చేశారన్నారు. కాంగ్రెస్ పాలనలో చేయని అవినీతి, అక్రమాలు లేవన్నారు. 1975లో ఏమర్జెన్సీ విధించిన పార్టీ కాంగ్రెస్ అని గుర్తు చేశారు. వాళ్ల అవినీతి బాగోతం బయటపడుతుంటే తట్టుకోలేక ఇలా అప్రజాస్వామిక విధానాలను కాంగ్రెస్ పార్టీ అవలంభించడం సిగ్గు చేటన్నారు.

వాళ్ల గత చరిత్ర తెలిదనుకొని ఇప్పటి నేతలు నిరసనలు చేయడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నేతల చరిత్ర పూర్తిగా తప్పుల తడక, వాళ్ల విధానాల వల్లే ఈ దేశం అభివృద్ధిలో కుంటు పడిందన్నారు. మోదీ ప్రధాని అయ్యాక ప్రపంచంతో దేశం అభివృద్ధి పదంలో దూసుకుపోవడన్ని జీర్ణించుకోలేని కాంగ్రెస్ నేతలు అడ్డదిడ్డంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇందిరాగాంధీ విధించిన ఏమర్జెన్సీనే ఎదుర్కొన్నవాళ్లం ఇలాంటి, నిరసనలు, దాడులు చేస్తే తిప్పి కొడతామని హెచ్చరించారు. కాంగ్రెస్ నేతలకు దేశాభివృద్ధికీ సహకరించడం తెలియదన్నారు. వారిని ప్రజలు విస్మరిస్తున్నా బుద్ధి రావడం లేదని గంట రవికుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.




## సమన్వయంతో ప్రశాంతంగా ఎన్నికలు

☐ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

**వరంగల్ వాయిస్, క్రైం :** అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించడంతో పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని సీపీ సన్‌ప్రీత్ సింగ్ అన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎన్నికలు ప్రశాంతంగా ముగియడంతో డీసీపీలు అంకిత్ కుమార్, రాజమహేంద్ర నాయక్, కవిత వరంగల్ పోలీస్ కమిషనర్ ని గురువారం మర్యాద పూర్వకంగా కలుసుకొని మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ డీసీపీ నుంచి మొదలుకొని హోంగార్డ్ స్థాయి వరకు అందరూ ఎన్నికలు ప్రకటన తేదీ నాటి నుంచి ప్రణాళిక ప్రకారం పనిచేయడంతో పాటు పోలింగ్ సమయంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా బందోబస్త్ నిర్వహించి ఎన్నికలను విజయవంతంగా పూర్తి చేయడంలో కీలకంగా నిలిచారన్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ అధికారులు, పోలీస్ సిబ్బందికి అభినందనలు తెలియజేసారు.

# ఈడీ వేధింపులపై కాంగ్రెస్ సమరభేరి

■ హనుమకొండలో భారీ నిరసన ర్యాలీ



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** నేషనల్ హెరాల్డ్ కేసు సాకుతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కాంగ్రెస్ అగ్రనేతలపై రాజకీయ కక్షసాధింపుకు పాల్పడుతోందని విమర్శిస్తూ హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. స్థానిక అంబేద్కర్ కూడలి వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నిరసనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, ఏఐసీసీ నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలను ఇబ్బంది పెట్టడమే లక్ష్యంగా కేంద్రం ఈడీని ప్రయోగిస్తోందని మండిపడ్డారు. నేషనల్ హెరాల్డ్ కేసులో ఈడీ తీరును ఢిల్లీ కోర్టు తప్పుబట్టిన విషయాన్ని ఆయన గుర్తు చేస్తూ, బీజేపీ దిగజారుడు రాజకీయాలకు ఇది నిదర్శనమని ధ్వజమెత్తారు. అంబేద్కర్ కూడలి నుంచి ప్రారంభమైన ర్యాలీలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ కార్యకర్తలు నినాదాలతో హోరెత్తించారు. ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తున్నారని నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ర్యాలీ కొనసాగుతుండగా పోలీసులు జోక్యం చేసుకుని ఎమ్మెల్యేతో పాటు పలువురు కీలక నేతలను, కార్యకర్తలను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పోలీసులకు, కార్యకర్తలకు మధ్య తోపులాట జరగడంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. ఈ నిరసన కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఈవీ శ్రీనివాస్ రావు, లైబ్రరీ చైర్మన్ అజీజ్, మునిసిపల్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు జక్కుల రవీందర్, విజయ శ్రీ రాజాలీ, మామిండ్ల రాజు, దేవరకొండ విజయలక్ష్మి సురేందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బంక సంపత్, అంకుష్, జిల్లా మహిళా అధ్యక్షురాలు బంక సరళ, ఎస్సీ సెల్ చైర్మన్ డా.పెరుమాండ్ల రామకృష్ణ, బీసీ సెల్ చైర్మన్ విక్రమ్, ఇతర విభాగాల అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## సర్పంచ్ రాధికా శ్రీనివాస్‌కు సన్మానం



**వరంగల్ వాయిస్, గణపురం :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కట్కూరి రాధిక శ్రీనివాస్‌ను గురువారం ఘనంగా సన్మానించారు. 12వ వార్డు సభ్యుడు కోడెపాక అనిల్ ఆధ్వర్యంలో సర్పంచ్ నివాసంలో ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. గ్రామ అభివృద్ధిలో సర్పంచ్ చూపుతున్న చొరవను, అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా అభినందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాధికా శ్రీనివాస్ మాట్లాడుతూ.. వార్డు సభ్యులు, ప్రజల సహకారంతో గణపురం మేజర్ పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. వార్డు సభ్యులతో పాటు మండల కాంగ్రెస్ పార్టీకి చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాజారామ్ కుటుంబానికి టీపీయూఎస్ భరోసా



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న స్వజాతి కుటుంబాలను ఆదుకోవడంలో తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం ఎల్లప్పుడూ ముందుంటుందని ఆ సంఘం నేతలు నిరూపించారు. వరంగల్ గిర్మాజిపేటకు చెందిన వెల్దండి రాజారామ్ ఈ నెల 11న మరణించగా, ఆయన కుటుంబం ఆర్థిక కష్టాల్లో ఉన్న విషయం సంఘం దృష్టికి వచ్చింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా పద్మశాలి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో గురువారం రాజారామ్ కుటుంబాన్ని పరామర్శించి, మానవతా దృక్పథంతో సహాయం అందజేశారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించిన సంఘం ప్రతినిధులు, వారికి ధైర్యం చెప్పారు. అనంతరం సంఘం తరపున రూ.10,000 నగదుతో పాటు 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. భవిష్యత్తులోనూ ఆ కుటుంబానికి ఏ అవసరం వచ్చినా సంఘం అండగా ఉంటుందని, తగిన సహాయ సహకారాలు అందిస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఈగ వెంకటేశ్వర్లు, ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కోడం రవిప్రకాష్, ప్రధాన కార్యదర్శి గుర్రపు రాజమౌళి పాల్గొన్నారు. వీరితో పాటు రాష్ట్ర ప్రచార కార్యదర్శి దేవులపల్లి సాయిరాజ్, జిల్లా సహాధ్యక్షులు కొండా శ్రీనివాస్, ఉపాధ్యక్షులు చిందం లింగమూర్తి, సంయుక్త కార్యదర్శి ఆడెపు నాగరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి గోరంట్ల అశోక్, కార్యవర్గ సభ్యులు గడ్డం రాజకుమార్ తదితరులు పాల్గొని రాజారామ్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు.

## పేదోడి సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం



**వరంగల్ వాయిస్, పరకాల:** అర్హులైన ప్రతి పేదవాడికి సొంతింటి కల నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పరకాల నియోజకవర్గ నాయకులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది.పరకాల మున్సిపాలిటీ పరిధిలోని రెండో వార్డుకు చెందిన ఒంటేరు సరోజన – లింగయ్య దంపతులకు ఇటీవల ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. ఈ నేపథ్యంలో గురువారం వారి గృహ నిర్మాణ పనులకు నాయకులు అధికారికంగా శ్రీకారం చుట్టారు. నిర్మాణ స్థలంలో ముగ్గు పోసి, కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. నిరుపేదలకు అండగా ఉండటమే ఎమ్మెల్యే రేవూరి ధ్యేయమని, మంజూరైన ఇండ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరకాల మున్సిపాలిటీ రెండో వార్డు ఆఫీసర్ కృష్ణంరాజు, పరకాల ఎస్సీ విభాగం అధ్యక్షులు బొమ్మకంటి చంద్రమౌళి, పట్టణ కాంగ్రెస్ నాయకులు బొచ్చు మోహన్, బొచ్చు జెమిని పాల్గొన్నారు. వీరితో పాటు ఒంటేరు మమత గోపి, మంద శాంతా జీవరత్నం, మంద జోష్ణ జీవన్, జ్యోతి అశోక్, ఒంటేరు సాంబలక్ష్మి, బొచ్చు శిరీష, ఒంటెరు రచన, వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పంచాయతీల్లో 'ప్రజాస్వామ్యం' ఓడింది

### తాటిపాముల వెంకట్రాములు ఆవేదన



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రజాస్వామ్యం అపహాస్యమైందని, సామాన్య ఓటరును ప్రలోభపెట్టి ధనస్వామ్యమే గెలిచిందని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు విమర్శించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రస్తుత ఎన్నికల సరళిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా, కనీసం శాసనసభ ఎన్నికలను మించి పంచాయతీ ఎన్నికల్లో డబ్బు విచ్చలవిడిగా ఖర్చయిందని ఆయన ధ్వజమెత్తారు. "ఒక సర్పంచ్ అభ్యర్థి పది లక్షల నుండి కోటి రూపాయల వరకు ఖర్చు చేస్తున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఒక్కో ఓటుకు రూ. 1000 నుండి రూ. 10,000 వరకు వెచ్చించడమే కాకుండా, మద్యం, మటన్, చికెన్, చీరలు పంపిణీ చేసి ఓటర్లను కొనుగోలు చేశారు" అని ఆయన ఆరోపించారు. డబ్బు ఇస్తేనే ఓటు వేస్తామనే స్థాయికి ఓటర్లు దిగజారడానికి రాజకీయ పార్టీల విధానాలు, ఎన్నికల సంఘం మరియు ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యమే కారణమని వెంకట్రాములు విమర్శించారు. చదువుకున్న వారు కూడా ప్రలోభాలకు గురికావడం ప్రజాస్వామ్యానికే గొడ్డలి పెట్టు అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "గెలిచిన వారు, ఓడిన వారు కూడా ఆస్తులు అమ్ముకుని, అప్పుల పాలై తలలు పట్టుకుంటున్నారు. ఈ ఆర్థిక భారం భరించలేక కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతుంటే ఆ కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయి." డబ్బుకు ఓటును అమ్ముకోకుండా, నిబద్ధతతో ఓటు వేసే రోజు ఎప్పుడు వస్తుందని ఆయన ప్రశ్నించారు. ధనస్వామ్యానికి చరమగీతం పాడి ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రజాస్వామ్యవాదులు, మేధావులు, స్వచ్ఛంద సంస్థలు తక్షణమే రంగంలోకి దిగి ప్రజలను చైతన్య పరిచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# కమల దళంపై 'కాంగ్రెస్' పంజా

• వరంగల్‌లో బీజేపీ జిల్లా కార్యాలయం ముట్టడి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నేషనల్ హెరాల్డ్ కేసు సాకుతో ఏఐసీసీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలను కేంద్ర ప్రభుత్వం వేధిస్తోందని నిరసిస్తూ వరంగల్ జిల్లా కాంగ్రెస్ శ్రేణులు సమరశంఖం పూరించాయి. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ అయూబ్ ఆధ్వర్యంలో గురువారం వరంగల్‌లోని బీజేపీ జిల్లా కార్యాలయాన్ని కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు ముట్టడించారు. ఈ క్రమంలో భారీగా మోహరించిన పోలీసులు కాంగ్రెస్ శ్రేణులను అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. ముట్టడిలో పాల్గొన్న పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం దర్యాప్తు సంస్థలను అడ్డం పెట్టుకుని ప్రతిపక్షాల గొంతు నొక్కుతోందని విమర్శించారు. నేషనల్ హెరాల్డ్ కేసులో ఈడీ వ్యవహారశైలిపై ఢిల్లీ కోర్టు చేసిన వ్యాఖ్యలే కేంద్రం చేస్తున్న అక్రమ రాజకీయాలకు నిదర్శనమని వారు పేర్కొన్నారు. "మోదీ, అమిత్ షాల కుట్రలకు కోర్టు తీర్పే చెంపదెబ్బ. గాంధీ కుటుంబాన్ని అప్రతిష్ట పాలు చేయాలని చూస్తే దేశ ప్రజలు చూస్తూ ఊరుకోరు" అని నాయకులు హెచ్చరించారు. బీజేపీ కార్యాలయం ముట్టడికి యత్నించిన నాయకులను, కార్యకర్తలను పోలీసులు బలవంతంగా అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పోలీసు వాహనాల్లో ఉంటూనే కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా "మోడీ.. కేడీ..", "బీజేపీ డౌన్ డౌన్" అంటూ కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. స్టేషన్ ముందు కూడా బైఠాయించి తమ నిరసనను కొనసాగించారు. ఈ ముట్టడి కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాల చైర్మన్లు, కార్పొరేటర్లు, ముఖ్య నాయకులు, వేల సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని సంఘీభావం తెలిపారు.

## గణపురంలో ఎక్సైజ్ దాడులు

### గుడుంబా విక్రేతల అరెస్ట్

**వరంగల్ వాయిస్, గణపురం :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండల కేంద్రంలో అక్రమంగా విక్రయిస్తున్న గుడుంబాను ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం మండల కేంద్రంలో జరిపిన ఆకస్మిక దాడుల్లో భారీగా గుడుంబా పట్టుబడినట్లు ఎక్సైజ్ ఎస్సై లింగ గౌడ్ వెల్లడించారు. మండలంలో రహస్యంగా గుడుంబా విక్రయాలు జరుగుతున్నాయన్న పక్కా సమాచారంతో ఎక్సైజ్ బృందం ఈ దాడులు నిర్వహించింది. విక్రయాలకు పాల్పడుతున్న పలువురిని అదుపులోకి తీసుకుని, వారి వద్దనున్న నిల్వలను ధ్వంసం చేయడంతో పాటు కొంత మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారు. అక్రమ మద్యం, గుడుంబా తయారీ మరియు విక్రయాలపై కఠినంగా వ్యవహరిస్తామని ఎస్సై హెచ్చరించారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
గురువారం, డిసెంబర్ 18, 2025

## భూపాలపల్లిలో కాంగ్రెస్ ప్రభంజనం

### మెజారిటీ సర్పంచ్ స్థానాలు కైవసం

### విజేతలకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు



**వరంగల్ వాయిస్, గణపురం :** జయశంకర్ భూపాలపల్లి నియోజకవర్గంలో జరిగిన మూడవ దశ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు ఘనవిజయం సాధించారు. నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ మద్దతుదారులే మెజారిటీ స్థానాలను కైవసం చేసుకోవడంపై భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల ఫలితాల అనంతరం ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీకి తిరుగులేదని ఈ ఫలితాలు నిరూపించాయని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సాగుతున్న ప్రభుత్వ పాలనకు ప్రజలు పట్టం కట్టారని ఆయన కొనియాడారు. గెలిచిన సర్పంచ్ అభ్యర్థులకు, వారికి అండగా నిలిచిన కార్యకర్తలకు ఎమ్మెల్యే ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. పంచాయతీ ఎన్నికల్లో చూపిన ఇదే స్ఫూర్తిని రాబోయే అన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కొనసాగించాలని ఎమ్మెల్యే కార్యకర్తలకు పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి పనుల్లో భాగస్వాములు కావాలని సూచించారు. కాంగ్రెస్ మద్దతుదారుల గెలుపుతో నియోజకవర్గంలోని గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

## సర్పంచ్ నూనె దివ్య తిరుపతికి సన్మానం



**వరంగల్ వాయిస్, శాయంపేట:** భారతీయ జనతా పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసే ప్రతి కార్యకర్తకు పార్టీలో తగిన గుర్తింపు, ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని బీజేపీ భూపాలపల్లి నియోజకవర్గ ఇంఛార్జి చందుపట్ల కీర్తి రెడ్డి అన్నారు. గురువారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శాయంపేట మండలం మైలారం గ్రామ నూతన సర్పంచ్‌గా ఎన్నికైన నూనె దివ్య తిరుపతి ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కీర్తి రెడ్డి నూతన సర్పంచ్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను గ్రామస్థాయిలో ప్రజలకు చేరవేయడంలో సర్పంచ్‌లు కీలక పాత్ర పోషించాలని సూచించారు. మైలారం గ్రామ అభివృద్ధికి తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నిషిధర్ రెడ్డి, శాయంపేట మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ, నాయకులు నూనె ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## ముస్త్యాలపల్లి ప్రజలకు రుణపడి ఉంటా

### సర్పంచ్ మ్యాకమల్ల వెంకటేష్



**వరంగల్ వాయిస్, నడికూడ :** ముస్త్యాలపల్లి గ్రామపంచాయతీ ఎన్నికల్లో తనను ఆదరించి, భారీ మెజారిటీతో గెలిపించిన గ్రామ ప్రజలకు నూతన సర్పంచ్ మ్యాకమల్ల వెంకటేష్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. గురువారం ఆయన తన గెలుపుపై స్పందిస్తూ, ముస్త్యాలపల్లి ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని ఎల్లవేళలా కాపాడుకుంటానని చెప్పారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ "ముస్త్యాలపల్లి అభివృద్ధికి ప్రజలందరి సహకారంతో అహర్నిశలు కృషి చేస్తాను. రాజకీయం ఏదైనా, గెలిచిన తర్వాత ఊరి ప్రయోజనాలే ముఖ్యం. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ, ఒక గ్రామ సేవకుడిలా పనిచేసి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతాను" అని పేర్కొన్నారు. వెంకటేష్ సర్పంచ్‌గా గెలుపొందిన వార్త తెలియగానే గ్రామస్థులు, అభిమానులు మరియు స్థానిక నాయకులు ఆయనకు పెద్ద ఎత్తున అభినందనలు తెలియజేశారు. పూలమాలలు, శాలువాలతో ఆయనను ఘనంగా సత్కరించారు. గ్రామ సమస్యల పరిష్కారంలో యువ నాయకత్వం రావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# సకాలంలో రైతులకు ఎరువులు

- అందుబాటులోకి ఎరువుల బుకింగ్ మొబైల్ యాప్
- రైతులు సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్



వరంగల్ వాయిస్, హనుమకొండ :రైతులకు సాగు కాలంలో ఎరువుల కొరత లేకుండా సకాలంలో యూరియా అందించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఎరువుల బుకింగ్ మొబైల్ యాప్'ను ప్రతి ఒక్క రైతు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ కోరారు. గురువారం ఆయన ఈ యాప్ పనితీరు, ప్రయోజనాలపై కీలక ప్రకటన విడుదల చేశారు. ఈ యాప్ ద్వారా కేవలం పట్టా ఉన్న రైతులే కాకుండా అందరికీ అవకాశం కల్పించినట్లు కలెక్టర్ తెలిపారు. పట్టాదార్ పాస్‌బుక్ ఉన్న రైతులు, ఆర్ఓఎఫ్ఆర్ (ROFR) పట్టా కలిగిన రైతులు,కౌలు రైతులు, పట్టా లేని రైతులు కూడా తమ ఆధార్ కార్డు, సాగు భూమి వివరాలతో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.రైతులు యాప్‌లో వివరాలు నమోదు చేయగానే ఆర్డర్ కన్ఫర్మ్ అవుతుంది. వెంటనే వారికి సమీపంలోని ఫెర్టిలైజర్ దుకాణం కేటాయించబడుతుంది. బుకింగ్ చేసుకున్న మరుసటి రోజే సంబంధిత దుకాణం నుండి రైతులు యూరియా బస్తాలను పొందవచ్చు. ఎరువుల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు సాగు విస్తీర్ణం ఆధారంగా విడుతల వారీగా పంపిణీ చేస్తారు. ఒక ఎకరం: ఒకే వాయిదాలో తీసుకోవచ్చు, 1 నుంచి 5 ఎకరాలు: రెండు వాయిదాలలో తీసుకోవాలి, 5 నుంచి 20 ఎకరాలు: నాలుగు వాయిదాలలో తీసుకోవాలి, ఒక విడత ఎరువులు తీసుకున్న తర్వాత, రెండో విడత బుకింగ్ చేసుకోవడానికి ఖచ్చితంగా 15 రోజుల వ్యవధి ఉండాలి. ఈ మొబైల్ అప్లికేషన్ వినియోగంపై ఇప్పటికే మండల వ్యవసాయ అధికారులు, ఏఈఓలు, సహకార సంఘాలు, ఫెర్టిలైజర్ దుకాణదారులకు పూర్తిస్థాయి అవగాహన కల్పించామని కలెక్టర్ పేర్కొన్నారు. రైతులకు ఏవైనా సందేహాలు ఉంటే వెంటనే స్థానిక వ్యవసాయ కార్యాలయాలను సంప్రదించాలని సూచించారు.

# సమరశంఖం పూరించిన ఆశా కార్యకర్తలు

- పారితోషికాలు చెల్లించకుంటే సర్వేలు బహిష్కరిస్తాం
- డీఎంహెచ్ఓ కార్యాలయం ముట్టడి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తమ శ్రమను ప్రభుత్వం దోచుకుంటోందని, గత ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పారితోషికాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ వరంగల్ జిల్లా ఆశా కార్యకర్తలు సమరశంఖం పూరించారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖా కార్యాలయాన్ని వందలాది మంది ఆశాలు ముట్టడించారు. బకాయిలు చెల్లించే వరకు ఎలాంటి కొత్త సర్వేలు చేయబోమని వారు తెగేసి చెప్పారు. ముట్టడిలో పాల్గొన్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి మాట్లాడుతూ సమాజంలో ప్రాణాంతక వ్యాధుల నివారణకు అహర్నిశలు శ్రమించే ఆశాలను ప్రభుత్వం బానిసల్లా చూస్తోందని మండిపడ్డారు. లెప్రసీ, పల్స్ పోలియో, టీబీ, డి–వార్మింగ్, ఎన్నికల డ్యూటీలకు సంబంధించి ఐదేళ్లుగా పైసలు ఇవ్వడం లేదని ఆరోపించారు. ముఖ్యంగా టీబీ వ్యాధిగ్రస్తులకు సేవలు అందిస్తున్నందుకు రావాల్సిన పారితోషికాలు తొమ్మిదేళ్లుగా పెండింగ్‌లో



ఉండటం దుర్మార్గమన్నారు. "రోజుకు రూ.75 ఇచ్చేందుకు కూడా బడ్జెట్ లేదనడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం. ఆశాల శ్రమను దోచుకుంటూ కొత్త సర్వేలు చేయమనడం సమంజసం కాదు." అని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆశా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు చినగారి రాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ.. బడ్జెట్ తిరిగి వెనక్కి వెళ్లిందని అధికారులు సాకులు చెబుతున్నారని విమర్శించారు. బకాయిలు చెల్లించకుండా సర్వేల కోసం ఆశాలపై ఒత్తిడి పెంచితే సహించబోమని హెచ్చరించారు. అనంతరం డీఎంహెచ్ఓ సాంబశివరావుకు వినతి పత్రం అందజేశారు. దీనిపై ఆయన స్పందిస్తూ.. పెండింగ్ పారితోషికాల అంశాన్ని పైఅధికారుల దృష్టికి తీసుకెళ్తానని, సర్వేల విషయంలో ఒత్తిడి లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ ఆందోళనలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి అరూరి కుమార్, ఆశా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీనపెల్లి చైతన్య, కోశాధికారి సుజాత, ఉపాధ్యక్షులు రమ, సహాయ కార్యదర్శి పద్మతో పాటు వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# పేదల గుడిసెలకు పట్టాలివ్వాలి

- సీపీఎం నాయకుల డిమాండ్




**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రభుత్వ భూముల్లో దశాబ్దాలుగా నివాసముంటున్న పేదలకు తక్షణమే ఇండ్ల పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో గురువారం వరంగల్ ఎమ్మార్వో కార్యాలయం ముందు రిలే నిరాహార దీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ దీక్షలను పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ బండారు రవికుమార్ ప్రారంభించి ప్రసంగించారు. ఈ సందర్భంగా బండారు రవికుమార్ మాట్లాడుతూ వరంగల్ నగరంలో గత 30 ఏళ్లుగా వేలాది మంది పేదలు ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుని నివసిస్తున్నారని తెలిపారు. వారికి ఆధార్, రేషన్ కార్డులతో పాటు ఓటు హక్కు ఉందని, ఇంటి పన్నులు, విద్యుత్ బిల్లులు కూడా చెల్లిస్తున్నారని గుర్తు చేశారు. అయినప్పటికీ, గత ప్రభుత్వాలు వారిని కేవలం ఓటు బ్యాంకుగా చూశాయే తప్ప, నివాస హక్కు కల్పించడంలో విఫలమయ్యాయని విమర్శించారు. "అధికారంలోకి వస్తే పట్టాలు ఇస్తామన్న హామీతోనే పేదలు కాంగ్రెస్ పార్టీని గెలిపించారు. జిల్లా మంత్రి కొండా సురేఖ, స్థానిక ఎమ్మెల్యేలు ఈ పేదలకు రుణపడి ఉన్నారు. తక్షణమే పట్టాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి. లేనిపక్షంలో పేదల ఆగ్రహానికి గురికాక తప్పదు" అని రవికుమార్ హెచ్చరించారు. ఈ దీక్షలు డిసెంబర్ 22 వరకు కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు. జిల్లా కమిటీ సభ్యులు ఆరూరి కుమార్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సింగారపు బాబు, కాశిబుగ్గ ఏరియా కార్యదర్శి ఎండి బషీర్ ప్రసంగించారు. దీక్షలో వల్లదాసు దుర్గయ్య, పంచకోటి సాంబమూర్తి, కోమండ్ల రాజు, వంగరి రవీందర్, దెయ్యాల లక్ష్మి, బొనగాని నగేష్, ఎండి ఇబ్రహీం, చిలువేరు ప్రశాంత్, రహీం ఖాన్, సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

గురువారం, డిసెంబర్ 18, 2025

# 20న కొత్తగూడెంలో ఐఎల్పీఏ రాష్ట్ర మహాసభలు

■ గోడపత్రికలు ఆవిష్కరించిన న్యాయవాదులు



**వరంగల్ వాయిస్, పరకాల :** సామాజిక న్యాయం, న్యాయవాదుల హక్కుల రక్షణే ధ్యేయంగా పనిచేస్తున్న ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ILPA) 5వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సాయిని నరేందర్ పిలుపునిచ్చారు. ఈ నెల 20న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో జరగనున్న ఈ సదస్సుకు సంబంధించిన గోడపత్రికలను గురువారం పరకాల కోర్టు ఆవరణలో న్యాయవాదులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాయిని నరేందర్ మాట్లాడుతూ దేశానికి స్వతంత్రం వచ్చి 80 ఏళ్లు గడుస్తున్నా సమాజంలో అసమానతలు కొనసాగడం శోచనీయమన్నారు. పూలే, అంబేద్కర్ సిద్ధాంతాల పునాదిగా పనిచేస్తున్న ఐఎల్పీఏ, న్యాయవాదుల వృత్తిపరమైన అభివృద్ధికి తోడు సామాజిక చైతన్యాన్ని కల్పించేందుకు కృషి చేస్తోందని తెలిపారు. కొత్తగూడెం సదస్సులో ప్రధానంగా రాజ్యాంగ విలువలు –ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీల హక్కులు, ఈడబ్ల్యూఎస్ కు లేని నిబంధనలు ఓబీసీలకు ఎందుకు?, మహిళా కోటాలో బహుజన మహిళలకు వాటా, న్యాయవాద రక్షణ చట్టం అమలు అనే నాలుగు అంశాలపై చర్చించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా మాజీ హైకోర్టు న్యాయమూర్తి, జాతీయ ఓబీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య హాజరవుతారని నరేందర్ తెలిపారు. విశిష్ట అతిథులుగా జిల్లా జడ్జి పాటిల్ వసంత్, అదనపు జిల్లా జడ్జి ఎస్. సరిత, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టి.చిరంజీవులు, ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత, కర్ణాటక సీనియర్ న్యాయవాది ఎస్.బాలన్ తదితర ప్రముఖులు పాల్గొంటారని వివరించారు. ఈ కార్యక్రమంలో పరకాల బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాదులు పున్నం రాజిరెడ్డి, లక్కం శంకర్, దొగేలా రమేష్, తడక సురేష్, పవన్ కుమార్, వెంకటరమణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణకారులకు అండగా 'సంతోష్ నర్సింగ్ హోమ్'

## పరకాలలో ఉచిత వైద్య శిబిరం



**వరంగల్ వాయిస్, పరకాల :** సామాజిక సేవలో భాగంగా పరకాల పట్టణ స్వర్ణకార సంఘం, డాక్టర్ సిరంగి సంతోష్ నర్సింగ్ హోమ్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం స్వర్ణకార సంఘ భవనంలో భారీ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరం ద్వారా సుమారు 160 మంది స్వర్ణకారులు, వారి కుటుంబ సభ్యులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన సలహాలు అందించారు. ఈ శిబిరంలో ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ దినేష్, గైనకాలజిస్ట్ డాక్టర్ ఎం. రాధిక రోగులకు గుండె సంబంధిత, స్త్రీ రోగ నిర్ధారణ పరీక్షలు చేశారు. వృత్తిరీత్యా వివిధ ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న స్వర్ణకారులకు ఈ శిబిరం ఎంతో మేలు చేకూర్చింది. ఉచితంగా వైద్య సేవలు అందించేందుకు ముందుకు వచ్చిన డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్‌ను సంఘం సభ్యులు ఈ సందర్భంగా ఘనంగా అభినందించారు. స్వర్ణకార సంఘ సేవా సొసైటీ సభ్యులు రావులకొలను ప్రసాద్, కందుకూరి రవీందర్, గుగ్గిళ్ళ సత్యం, కడార్ల రామాచారి, మరపాక విజయ్, రుద్రోజు ఉత్తమ్, కందుకూరి శ్రీధర్ దగ్గరుండి ఈ శిబిరాన్ని పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో సంఘం సీనియర్ నాయకులు రావులకొలను నరసింహమూర్తి, గుగ్గిళ్ళ రాజు, తోగిటి శంకరాచారి, కందుకూరి వేణుగోపాల మూర్తి, వంగల కోటేశ్వర్, బెజ్జంకి పూర్ణ చారి, ఎదులాపురం కార్తీక్, పొడిచేటి రామన్న, తంగళ్ళపల్లి రామ్ బ్రహ్మం, తంగళ్ళపల్లి దేవేందర్, జమ్మకం రమేష్, కందుకూరి నరేష్ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ప్రమాద రహిత డ్రైవింగే లక్ష్యం కావాలి

## ఆర్టీసీ రీజినల్ మేనేజర్ విజయభాను



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేరవేయడమే ఆర్టీసీ ప్రథమ కర్తవ్యమని, ప్రతి డ్రైవర్ ప్రమాద రహిత డ్రైవింగ్‌ను లక్ష్యంగా పెట్టుకోవాలని వరంగల్ రీజినల్ మేనేజర్ దర్శనం విజయభాను పిలుపునిచ్చారు. టీజీఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వై.నాగిరెడ్డి ఆదేశాల మేరకు, వరంగల్ రీజియన్ పరిధిలోని అన్ని డిపోలలో పనిచేస్తున్న హైర్ బస్సు డ్రైవర్ల కోసం గురువారం ప్రత్యేక నైపుణ్య అభివృద్ధి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎం విజయభాను మాట్లాడుతూ.. డ్రైవర్లు విధి నిర్వహణలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డ్రైవింగ్ చేసే సమయంలో సెల్ ఫోన్ మాట్లాడటం వంటి పొరపాట్లు చేయకూడదని, ట్రాఫిక్ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని కోరారు. కొన్ని క్లిష్ట సమయాల్లో ప్రమాదాలను నివారించడానికి డ్రైవర్లు చాకచక్యంగా వ్యవహరించాలని, అందుకు ఇలాంటి శిక్షణలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. డ్రైవర్లు తమ విధులతో పాటు ఆరోగ్య పరిరక్షణపై కూడా శ్రద్ధ వహించాలని ఆర్ఎం సూచించారు. సరైన సమయానికి పౌష్టికాహారం తీసుకోవాలని, తగినంత విశ్రాంతి పొందినప్పుడే మానసిక ప్రశాంతతతో, ఏకాగ్రతతో బస్సులను నడపగలరని పేర్కొన్నారు. డ్రైవర్ల నైపుణ్యాన్ని మరింత మెరుగుపరిచేందుకు సంస్థ ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ (ఆపరేషన్స్) కేశరాజు భాను కిరణ్, రీజియన్ పరిధిలోని అన్ని డిపోల నుంచి ఎంపిక చేయబడిన హైర్ బస్సు డ్రైవర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# సర్పంచులు గ్రామాభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలి

■ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** ప్రజలు పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి సూచించారు. గురువారం భూపాలపల్లి నియోజకవర్గంలోని వివిధ మండలాల నుండి నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు, వార్డు సభ్యులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. మొగుళ్లపల్లి మండల మాజీ జడ్పీటీసీ, పర్లపల్లి సర్పంచ్‌గా ఎన్నికైన జోరుక సదయ్య, శాయంపేట మండలం గోవిందాపురం సర్పంచ్ దాసి స్వాతి శ్రావణ్ కుమార్, మైలారం సర్పంచ్ నూనె దివ్య తిరుపతి గారు మాజీ ఎమ్మెల్యేను కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వారితో పాటు గోవిందాపురం ఉప సర్పంచ్ కల్వల నరేందర్, మొగుళ్లపల్లి గ్రామ వార్డు సభ్యులు కూడా ఉన్నారు. నూతనంగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులకు గండ్ర వెంకట రమణా రెడ్డి శుభాకాంక్షలు తెలిపి, వారిని శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు మిమ్మల్ని నమ్మి ఓటు వేశారు. రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధి కోసం నిరంతరం శ్రమించాలి. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలి" అని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రికార్డుల వీరుడు కొండా మురళి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** భారతదేశ రాజకీయ చరిత్రలోనే ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికై రికార్డు సృష్టించిన మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు ఆ ఘనత సాధించి నేటికి పది సంవత్సరాలు పూర్తయింది. ఈ చారిత్రాత్మక సందర్భాన్ని పురస్కరించుకొని గురువారం వరంగల్ ఓ సిటీలోని ఆయన నివాసంలో (క్యాంప్ కార్యాలయం) కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, న్యాయవాదులు ఆయనను కలిసి ఘనంగా అభినందనలు తెలిపారు. వరంగల్ జిల్లా కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్ శామంతుల శ్రీనివాస్ ఆధ్వర్యంలోని బృందం కొండా మురళీధర్ రావును మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా ఆయనకు పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయాల్లో కొండా మురళీధర్ రావు తనదైన ముద్ర వేశారని, దేశంలోనే ఏకగ్రీవ ఎమ్మెల్సీగా నిలిచి వరంగల్ గడ్డ గర్వించేలా చేశారని ఈ సందర్భంగా నేతలు కొనియాడారు. మురళీధర్ రావు వారితో కాసేపు ముచ్చటించి, కార్యకర్తలు, నాయకులు అందిస్తున్న ఆదరాభిమానాలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టూరి సుధాకర్, డాక్టర్ వెంకన్న, రాజు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# సంక్షేమ పాలనకే ప్రజల పట్టం

## సీఎం రేవంత్ రెడ్డి

## పంచాయతీ పోరులో 'హస్తం' ప్రభంజనం

## 62 శాతం స్థానాలు కైవసం



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** రాష్ట్రంలో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అద్భుత విజయాన్ని నమోదు చేసిందని, ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడిచినా ప్రజలు తమపై అదే ఆదరణ చూపడం హర్షణీయమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన ఎన్నికల ఫలితాలను విశ్లేషించారు. 12,702 పంచాయతీలకు ఎన్నికలు ప్రశాంతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా ముగిశాయని, ఇందుకు సహకరించిన అధికారులకు, కష్టపడిన కార్యకర్తలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి వెల్లడించిన వివరాల ప్రకారం, కాంగ్రెస్ పార్టీ, దాని మద్దతుదారులు క్లీన్ స్వీప్ దిశగా దూసుకెళ్లారు. మొత్తం 7,522 గ్రామ పంచాయతీల్లో కాంగ్రెస్ అధికారికంగా గెలుపొందింది. మరో 820 స్థానాల్లో కాంగ్రెస్ రెబల్ అభ్యర్థులు విజయం సాధించారు. మొత్తంగా 62 శాతం సర్పంచ్ స్థానాలను కాంగ్రెస్ పార్టీ తన ఖాతాలో వేసుకుంది. బీఆర్ఎస్, బీజేపీ కలిసి పోటీ చేసినా కేవలం 33 శాతం సీట్లకే పరిమితమయ్యాని సీఎం విమర్శించారు. పంచాయతీ ఎన్నికలు జరిగిన 94 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ తన పట్టును నిరూపించుకుంది. 87 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ స్పష్టమైన ఆధిక్యం సాధించింది. గత అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే అదనంగా 21 నియోజకవర్గాల్లో పార్టీ బలోపేతమైంది. బీఆర్ఎస్ కేవలం 6 నియోజకవర్గాల్లో, బీజేపీ ముథోల్ నియోజకవర్గంలో మాత్రమే మెజారిటీ సాధించాయి. జరిగిన రెండు ఉప ఎన్నికల్లోనూ కాంగ్రెస్ జైత్రయాత్ర కొనసాగిందని సీఎం గుర్తుచేశారు. "పేదలకు మేము అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని సమపాళ్లలో కొనసాగించడమే మా విజయానికి కారణం. ఈ ఎన్నికల్లో ప్రభుత్వం ఎలాంటి అధికారిక దుర్వినియోగానికి పాల్పడలేదు. స్వేచ్ఛాయుతంగా ప్రజలు తమ తీర్పును ఇచ్చారని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. విపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు అభివృద్ధి వైపే నిలబడ్డారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# ప్రజాస్వామ్య విజయంలో అదృశ్య శ్రామికులు

తెలంగాణలో ఇటీవల ముగిసిన గ్రామపంచాయతీ ఎన్నికలు ప్రజాస్వామ్య వ్యవస్థ బలాన్ని ప్రపంచానికి చాటిచెప్పాయి. అయితే, ఈ ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగడం వెనుక వేలాది మంది ఎన్నికల సిబ్బంది అంకితభావం, వారు పడిన కష్టాలు ఎన్నటికీ మరువలేనివి. ఎముకలు గడ్డకట్టే చలిని లెక్కచేయకుండా, కనీస వసతులు లేకున్నా విధులు నిర్వర్తించిన సిబ్బంది తీరు అభినందనీయం. ఎన్నికల శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు శాఖ పాత్ర వెలకట్టలేనిది. చలి తీవ్రతకు చేతులు మొద్దుబారుతున్నా, తెల్లవారుజాము నుండే పోలింగ్ కేంద్రాల వద్ద పహారా కాశారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉంటూ, ఘర్షణలు తలెత్తకుండా చాకచక్యంగా వ్యవహరించారు. రాత్రిపూట కూడా నిద్రలేకుండా భద్రతా విధులు నిర్వహించి అంకితభావాన్ని చాటుకున్నారు. ఎన్నికల నిర్వహణలో వెన్నెముకగా నిలిచే ఉపాధ్యాయులు ఈ చలికాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దూర ప్రాంతాల నుండి పోలింగ్ కేంద్రాలకు చేరుకోవడం, సరైన భోజన వసతి లేకున్నా ఓటర్లకు సహకరిస్తూ గంటల తరబడి విధులు నిర్వహించడం వారి అంకితభావానికి నిదర్శనం. కుటుంబ బాధ్యతలను పక్కనపెట్టి ప్రజాస్వామ్య విధిని ప్రథమంగా భావించి వారు చేసిన త్యాగం అమోఘం. ఉపాధ్యాయులతో పాటు రెవెన్యూ, పంచాయతీ రాజ్, విద్యుత్, ఆరోగ్య మరియు మున్సిపల్ శాఖల ఉద్యోగులు అలుపెరగకుండా శ్రమించారు. పోలింగ్ ఏర్పాట్లు, లాజిస్టిక్స్, సమాచార సమన్వయం వంటి బాధ్యతలను చలిని లెక్కచేయకుండా నిర్వర్తించారు. వీరి సమిష్టి కృషి వల్లే ఎన్నికల ప్రక్రియ విఘాతం కలగకుండా పూర్తయింది.

**'మీడియా పాత్ర – ప్రజల భాగస్వామ్యం'**

ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు క్షేత్రస్థాయిలో ఉండి ఎప్పటికప్పుడు వార్తలు అందిస్తూ పారదర్శకతను కాపాడారు. అలాగే, చలిని సైతం తట్టుకుని పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేసిన ప్రజలు తమ ప్రజాస్వామ్య పరిపక్వతను చాటారు. గ్రామాభివృద్ధిని కాంక్షిస్తూ ఓటర్లు చూపిన ఉత్సాహం ప్రశంసనీయం. గ్రామ పంచాయతీ ఎన్నికల విజయానికి కారణమైన ప్రతి ఉద్యోగికి, పోలీస్ సిబ్బందికి, మీడియా ప్రతినిధులకు సమాజం రుణపడి ఉంటుంది. వసతులు తక్కువైనా బాధ్యతను ఎక్కువగా భావించిన వీరి సేవలను ప్రభుత్వం గుర్తించి అభినందించాల్సిన అవసరం ఉంది.

వ్యాసకర్త
సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్
సెల్ -99497 09866



# ప్రతిభకు పేదరికం అడ్డుకాదు

◆ దాస్యం వినయ్ భాస్కర్
◆ ఆటో డ్రైవర్ కూతరు హర్షిణికి సన్మానం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కష్టపడి చదివే సంకల్పం ఉంటే పేదరికం ఏనాటికీ అడ్డుకాదని మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. హనుమకొండకు చెందిన ఆటో డ్రైవర్ మేకల రమేష్ కుమార్తె హర్షిణి, వైద్య విద్యలో అత్యున్నతమైన పీజీ రేడియాలజీ విభాగంలో సీటు సాధించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. గురువారం బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో హర్షిణిని శాలువాతో సత్కరించి, పూలమొక్కను బహుకరించి అభినందించారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ తెలంగాణలో వైద్య విద్యను సామాన్యులకు చేరువ చేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని అన్నారు. ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజీని ఏర్పాటు చేయడం వల్ల ఎంతో మంది పేద విద్యార్థులు నేడు డాక్టర్లుగా మారుతున్నారని పేర్కొన్నారు. మేకల హర్షిణి సాధించిన విజయం ఎంతో మందికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం పనిచేస్తున్న 'త్రిచక్ర పొదుపు పరస్పర సహకార సంఘం' సేవలను వినయ్ భాస్కర్ ప్రశంసించారు. "ఒకరి కోసం అందరూ – అందరి కోసం ఒక్కరు" అనే నినాదంతో ఈ సంఘం ఆటో డ్రైవర్ల పిల్లల చదువులకు, ఇతర అవసరాలకు రుణ సదుపాయం అందిస్తూ అండగా నిలుస్తోందని తెలిపారు. ఇదే క్రమంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ.. గత రెండేళ్లలో ఉపాధి కరువై వందలాది మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలకు పాల్పడటం బాధాకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, కార్పొరేటర్ సంకు నర్సింగ్ రావు, మాజీ కార్పొరేటర్ ఉడతల సారంగపాణి, కుసుమ లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు. అలాగే త్రిచక్ర పొదుపు సంఘం బాధ్యులు రవీందర్ రెడ్డి, ఈసంపెల్లి సంజీవ్, మడికొండ బాబు, జిలకర స్వామి, చీకటి కుమార్, బీఆర్ఎస్ నాయకులు పులి రజినీకాంత్, మిట్టపెల్లి రమేష్ పాల్గొన్నారు.

# పట్టాలివ్వకుంటే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ఆక్రమిస్తాం




వరంగల్ వాయిస్, వరంగల్ : జక్కలొద్దీ రామ సురేందర్ నగర్ గుడిసె వాసులందరికీ తక్షణమే ఇళ్ల పట్టాలు ఇవ్వాలని, లేనిపక్షంలో గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పేదలకు పంచుతామని సీపీఎం మాజీ కేంద్ర కమిటీ సభ్యులు కామ్రేడ్ జి.నాగయ్య ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గురువారం ఖిలా వరంగల్ తహసిల్దార్ కార్యాలయం ముందు సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా నాగయ్య మాట్లాడుతూ.. ఏళ్లు గడిచినా, ప్రభుత్వాలు మారినా పేదల బతుకులు మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జక్కలొద్దీ రామ సురేందర్ నగర్ వాసులు ఐదేళ్లుగా కనీస మౌలిక సదుపాయాలు లేక, విష జంతువుల భయం మధ్య గుడిసెల్లోనే కాలం వెళ్లదీస్తున్నారని పేర్కొన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో ఒక్కరికి కూడా ఇల్లు ఇవ్వకుండా పేదలను మోసం చేసిందని, అందుకే ప్రజలు ఆ ప్రభుత్వాన్ని కూల్చారని విమర్శించారు. ప్రజా పాలన అని చెబుతున్న కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా ఇళ్ల పట్టాల ఊసే లేదన్నారు. మంత్రి కొండా సురేఖ, ఎంపీ కడియం కావ్య ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను విస్మరించారని మండిపడ్డారు. కేరళ రాష్ట్రంలో సీపీఎం ప్రభుత్వం ఇల్లు లేని పేదలకు రూ.10 లక్షలు అందించి పక్కా ఇళ్లు నిర్మిస్తోందని, తెలంగాణలో కూడా అదే దిశగా అడుగులు వేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఇప్పటికే 30 వేల గుడిసెలు వేసి పేదలకు అండగా నిలిచిన చరిత్ర తమ పార్టీదని గుర్తు చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి కామ్రేడ్ రంగయ్య, కార్యవర్గ సభ్యురాలు నలిగంటి రత్నమాల మాట్లాడుతూ.. జక్కలొద్దీ గుడిసె వాసులకు పట్టాలు ఇచ్చి, కరెంటు సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు నెరవేర్చకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ దీక్షలలో పూలమాలలు వేసి దీక్షా పరులను అభినందించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నలిగంటి రత్నమాల (అధ్యక్షత), తూర్పాటి కవిత, మైదం వినోదమ్మ, దుప్పటి రమ్య, బెజ్జాల కోటేశ్వర్, ఉసిల్ల కుమార్, టి. భవాని, ఎం. జ్యోతి కృష్ణ, గాదె లక్ష్మణ్, వెంకటేశ్వర్లు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పరకాలలో బీజేపీ విజయ డంకా

## సర్పంచ్ స్థానాలు కైవసం

## విజేతలను అభినందించిన కాళీ ప్రసాద్ రావు



**వరంగల్ వాయిస్,పరకాల :** పరకాల నియోజకవర్గంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ తన సత్తా చాటింది. బీజేపీ మద్దతుతో పోటీ చేసిన అభ్యర్థులు ఘనవిజయం సాధించడం పట్ల పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. ఈ సందర్భంగా విజేతలను బీజేపీ రాష్ట్ర నాయకులు, పరకాల కంటెస్టెడ్ ఎమ్మెల్యే డా.పగడాల కాళీ ప్రసాద్ రావు, బీజేపీ జిల్లా అధ్యక్షులు కొలను సంతోష్ రెడ్డి ఘనంగా సన్మానించారు. ఆత్మకూరు మండలం చౌలపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్‌గా గెలుపొందిన మోరే రాజేశ్వరరావు, దామెర మండలం పసరగొండ సర్పంచ్‌గా విజయం సాధించిన కొట్టే శ్రీవాణి రమేష్, నూతన వార్డు సభ్యులను నేతలు శాలువాలతో సత్కరించి, మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డా.కాళీ ప్రసాద్ రావు మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే ఈ విజయానికి పునాది అని కొనియాడారు. కేంద్ర నిధులతో గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధిని ప్రజలు గుర్తించి బీజేపీకి పట్టం కట్టారని పేర్కొన్నారు.ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పటి నుండి నాయకులు, కార్యకర్తలు చేసిన కృషితోనే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు. రానున్న అన్ని ఎన్నికల్లోనూ ఇదే ఉత్సాహంతో ముందుకు సాగి విజయకేతనం ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మారెడ్డి, 60వ డివిజన్ కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్, మంద ఐలయ్య, మంద రమేష్, బీజేపీ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజలకు అందుబాటులో ఉండాలి

● సర్పంచ్ సుదర్శన్ కు ఎమ్మెల్యే సూచన



**వరంగల్ వాయిస్, రేగొండ :** పంచాయతీ ఎన్నికల్లో గెలిచిన ప్రజాప్రతినిధులు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, గ్రామ సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సూచించారు. రేగొండ మండలం తిరుమలగిరి గ్రామ నూతన సర్పంచ్‌గా ఎన్నికైన చల్లగురుల సుదర్శన్, గురువారం భూపాలపల్లిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గండ్రను మర్యాదపూర్వకంగా కలిశారు. సుమారు 50 మంది కార్యకర్తలతో కలిసి వచ్చిన సర్పంచ్ సుదర్శన్, ఎమ్మెల్యేకు పూలమొక్కను అందించి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, సర్పంచ్‌ను శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. గ్రామస్థాయిలో పారదర్శకమైన పాలన అందించాలని, అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం సర్పంచ్ సుదర్శన్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి గెలిపించిన తిరుమలగిరి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తానని తెలిపారు. గ్రామంలో మౌలిక వసతులు, రోడ్లు, తాగునీరు, పారిశుధ్యం మెరుగుపరచడమే తన ప్రథమ లక్ష్యమని పేర్కొన్నారు. ఎమ్మెల్యే సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో ముందుంచుతానని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ విజ్జన్ రావు, మాజీ సర్పంచ్ కట్ల రాణి–మధుసూదన్ రెడ్డి, వార్డు సభ్యులు వైనాల సవిత–శ్రీను, గడ్డం జాన్సీ–సురేష్, బక్కతట్ల సతీష్, ఇండ్ల రాధ–రాజయ్య, పాలడుగుల మల్లయ్య, మండల తిరుపతి, మల్యాల కొమురయ్య, మొహమ్మద్ అఫ్రోజ్, మ్యాధరి ప్రశాంత్, మచ్చిక వేణు, మూలగుండ్ల సాంబరెడ్డి, గుండారపు భాస్కర్ రెడ్డి, తిరుపతి, మ్యాదారబోయిన శివ, నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# హద్దుమీరిన అభిమానం

## నిధి అగర్వాల్‌కు చేదు అనుభవం

కొన్నిసార్లు అభిమానం హద్దులు దాటితే అది అభిమానంగా కాకుండా వేధింపుగా మారుతుంది. ముఖ్యంగా హీరోయిన్ల విషయంలో కొంతమంది అభిమానుల ప్రవర్తనపై ఇప్పటికే తీవ్ర విమర్శలు వస్తున్నాయి. తాజాగా ప్రభాస్ నటిస్తున్న 'రాజాసాబ్' హీరోయిన్ నిధి అగర్వాల్‌కు ఇలాంటి షాకింగ్ అనుభవమే ఎదురైంది. ఆమెను చుట్టుముట్టిన అభిమానులు తోసేసుకుంటూ హీరోయిన్‌పైకి ఎగబడిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ప్రభాస్ హీరోగా నటిస్తున్న హారర్ కామెడీ థ్రిల్లర్ 'రాజాసాబ్'లో ముగ్గురు హీరోయిన్లలో నిధి అగర్వాల్ ఒకరు. ఈ చిత్రంలోని 'సహన సహన' పాటను బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని లూలూ మాల్‌లో సాంగ్ లాంచ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ ఈవెంట్‌కు నిధి అగర్వాల్‌తో పాటు మరో హీరోయిన్ రిధి కుమార్ కూడా హాజరయ్యారు. సాంగ్ లాంచ్ కార్యక్రమానికి భారీగా అభిమానులు తరలివచ్చారు. ఈవెంట్ జరుగుతున్నంతసేపూ స్టేజ్ ముందు గుమిగూడిన అభిమానులు తోసుకుంటూనే కనిపించారు. అయితే ఈవెంట్ ముగిసిన తర్వాత పరిస్థితి మరింత దారుణంగా మారింది. నిధి అగర్వాల్ బయటకు వెళ్లే సమయంలో ఒక్కసారిగా అభిమానులు ఆమెపైకి ఎగబడారు. తోసుకుంటూ ముందుకు రావడం, చేతులు వేయడం వంటి ఘటనలు చోటు చేసుకున్నాయి. సెక్యూరిటీ సిబ్బంది తీవ్రంగా శ్రమించడంతో చివరికి నిధి అగర్వాల్ కారులోకి ఎక్కగలిగింది. కారులో కూర్చోగానే ఆమె 'ఓ మై గాడ్' అంటూ షాక్‌కు గురైన దృశ్యాలు వీడియోల్లో కనిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా, ప్రభాస్ నటిస్తున్న 'రాజాసాబ్' సినిమా 2026 సంక్రాంతికి విడుదల కానుంది. జనవరి 9న థియేటర్లలో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది.





# అల్లు అర్జున్ సిస్టర్‌గా మృణాల్ ఠాకూర్?

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, స్టార్ దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కబోయే భారీ చిత్రంపై బన్నీ ఫ్యాన్స్‌తో పాటు సినీ ఇండస్ట్రీలోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ ప్రాజెక్ట్ అనౌన్స్‌మెంట్ వచ్చినప్పటి నుంచే అధికారిక అప్‌డేట్స్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా ఈ సినిమాకు సంబంధించిన మరో క్రేజీ టాక్ సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. ఈ మూవీలో బాలీవుడ్ నటి మృణాల్ ఠాకూర్ కీలక పాత్రలో కనిపించనున్నట్లు ఇప్పటికే వార్తలు వచ్చాయి. అయితే తాజాగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం, మృణాల్ ఠాకూర్ ఈ సినిమాలో అల్లు అర్జున్‌కు సిస్టర్ రోల్‌లో నటించబోతున్నారట. ఈ పాత్ర కథలో చాలా కీలకమైనదిగా, బలమైన ఎమోషనల్ టోన్‌తో సాగుతుందని టాక్. అన్న`చెల్లెల్ల మధ్య బంధం, భావోద్వేగాలను అట్లీ తన మార్క్ స్టైల్‌లో చూపించబోతున్నాడని, ఈ పాత్ర ప్రేక్షకులను బాగా కనెక్ట్ చేస్తుందని అంటున్నారు. అయితే ఇది అధికారికంగా ధృవీకరించాల్సి ఉంది. ఇక ఈ సినిమాకు సంబంధించిన మరో హైలైట్ ఏమిటంటే.. బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పడుకోణె ఇందులో మెయిన్ హీరోయిన్‌గా నటించనుండగా, జాన్వీ కపూర్ మరో కీలక హీరోయిన్ పాత్రలో కనిపించనుంది. ఒకే సినిమాలో ఇంతమంది స్టార్ హీరోయిన్లు ఉండటం వల్ల ఈ ప్రాజెక్ట్‌పై మరింత క్రేజ్ పెరుగుతోంది. కథ విషయానికి వస్తే.. మాఫియా బ్యాక్‌డ్రాప్‌లో ఓ డాన్ చుట్టూ తిరిగే పవర్‌ఫుల్ కథను అట్లీ సిద్ధం చేశాడట.






# రెండు ఓటీటీల్లోకి సంతాన ప్రాప్తిరస్తు

ప్రేమ, కెరీర్, రిలేషన్‌షిప్స్ మాత్రమే కాదు, ఈతరం చెప్పలేనంత సున్నితమైన సమస్యలతో కూడా సంఘర్షణ పడుతోంది. అందులో ఒకటి సంతాన లేమి. బయటికి మాట్లాడాలంటే సంకోచం, లోపల వేల సందేహాలు, వందల ఒత్తిడులు. అలాంటి సున్నితమైన విషయాన్ని కథగా మలచుకున్న సినిమా 'సంతాన ప్రాప్తిరస్తు'. విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా నటించిన ఈ సినిమాకు సంజీవ్ రెడ్డి దర్శకత్వం వహించాడు. నవంబర్ 14న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం మంచి విజయాన్ని అందుకుంది. అయితే ఇప్పుడి ఇదే చిత్రం తాజాగా రెండు ఓటీటీల్లో విడుదల కానుంది. 'అమెజాన్ ప్రైమ్ వీడియో', 'జియో హాట్‌స్టార్'లో ఈ నెల 19 నుంచి స్ట్రీమింగ్ కాబోతున్నట్లు ప్రకటించింది. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. చైతన్య సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. ఓ ఎగ్జామ్ సెంటర్ లో కల్యాణి  ను చూసి ప్రేమలో పడతాడు. ఇద్దరూ దగ్గరౌతారు. కల్యాణి తండ్రి ఈశ్వరరావు  వీరి ప్రేమని వ్యతిరేకించడంతో ఇద్దరూ పారిపోయి పెళ్లి చేసుకుంటారు. త్వరగా బిడ్డని కనేస్తే అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని భావిస్తాడు చైతు. కాకపోతే పిల్లల విషయంలో తన ప్రయత్నాలు ఫలించవు. దీంతో ఓ సంతాన సాఫల్య కేంద్రాన్ని ఆశ్రయిస్తాడు. వైద్య పరీక్షలు చేయించుకోగా చైతన్యకి ఓ సమస్య ఉన్నట్లు బయట పడుతుంది. తర్వాత ఏం జరిగింది? తన సమస్య కారణంగా చైతన్య ఎలాంటి పరిస్థితులు ఎదురుకున్నాడు? చివరకు చైతన్య, కల్యాణికి పిల్లలు పుట్టారా లేదా ?అనేది మిగతా కథ.

# సత్తా చాటిన అక్షయ్ ఖన్నా

'ధురంధర్' వంటి సూపర్ హిట్ సినిమాతో సీనియర్ నటుడు అక్షయ్ ఖన్నా క్రేజ్ మరోసారి ఆకాశాన్ని తాకింది. రణవీర్ సింగ్ హీరోగా నటించిన ఈ సినిమాలో అక్షయ్ ఖన్నా రెహ్మాన్ డకైట్ అనే పవర్‌ఫుల్ నెగటివ్ పాత్రలో నటించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. విలన్ అయినప్పటికీ హీరోకంటే ఎక్కువ ప్రశంసలు దక్కడం ఆయన నటనకు నిదర్శనంగా మారింది. ప్రతి సీన్‌లో తనదైన స్టైల్, ఇంపాక్ట్‌తో మెరిసిన అక్షయ్ ఖన్నా 'ధురంధర్' సినిమాకు ప్రధాన బలంగా నిలిచారు. ఇదే ఏడాది ప్రారంభంలో విక్కీ కౌశల్ హీరోగా నటించిన 'చావా' సినిమాలో ఔరంగజేబు పాత్రలో అద్భుతమైన నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకున్న ఆయన, ఇప్పుడు 'ధురంధర్'తో మరోసారి తన సత్తా చాటారు. కథ, పాత్ర ఏదైనా సరే.. తెరపై కనిపిస్తే తనదైన ముద్ర వేయడం అక్షయ్ ఖన్నాకే చెల్లింది అని అభిమానులు అభిప్రాయపడుతున్నారు.ఇక సినిమాలతో పాటు అక్షయ్ ఖన్నా వ్యక్తిగత జీవితం కూడా తరచూ చర్చకు వస్తుంటుంది. ప్రస్తుతం ఆయన వయసు సుమారు 50 సంవత్సరాలు.  'నాకు బాధ్యతలు వద్దు. నేను ఒంటరిగా ఉండటానికే ఇష్టపడతాను. నాకు ఇప్పుడు ఉన్న జీవితం చాలా బాగుంది. దాన్ని ఎందుకు మార్చుకోవాలని ఆయన వ్యాఖ్యానించారు. అక్షయ్ ఖన్నా ప్రముఖ బాలీవుడ్ నటుడు వినోద్ ఖన్నా కుమారుడు. 2025 నాటికి ఆయన మొత్తం ఆస్తులు సుమారు రూ.167 కోట్లుగా అంచనా వేయబడుతున్నాయి. దేశంలోని పలు ప్రాంతాల్లో బంగ్లాలు, విలాసవంతమైన కార్లు ఆయన సొంతం. సినిమాలతో పాటు రియల్ ఎస్టేట్ పెట్టుబడుల ద్వారా కూడా భారీగా సంపాదిస్తున్నారు. నటుడిగా, వ్యక్తిగా తనదైన మార్గంలో ముందుకు సాగుతున్న అక్షయ్ ఖన్నా, పెళ్లి లేకుండానే సంతృప్తికరమైన జీవితాన్ని గడుపుతూ బాలీవుడ్‌లో తన ప్రత్యేక స్థానాన్ని నిలబెట్టుకుంటున్నారు.



# నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

- స్థలం లేని నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ లు
- దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- 38, 39 డివిజన్ లలో రూ.2.68 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ తూర్పు నియోజక వర్గ అభివృద్ధి ప్రధాన లక్ష్యంగా పని చేస్తున్నట్లు రాష్ట్ర దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. గురువారం వరంగల్ తూర్పు నియోజక వర్గ పరిధిలోని 38, 39 డివిజన్ లలో రూ.2.68 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 38వ డివిజన్ లో సీసీ రోడ్లు, డ్రైన్లలకు శంకుస్థాపనతో పాటు కమ్యూనిటీ హాల్ ను ప్రారంభించుకోవడం హర్షనీయమన్నారు. ఖిలా వరంగల్ ఈద్గాకు కోటి రూపాయలు మంజూరు చేసి మరమత్తులు చేపట్టి ఒక ఆకారానికి తీసుకురావడానికి తాను గతంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే కోరడం జరిగిందన్నారు. ఈ ప్రాంతంలో నీరు శాశ్వతంగా నిలిచి ఉండడంతో మొత్తం ఫ్లోరింగ్ చేపట్టి సౌకర్యవంతంగా ఉండేలా చర్యలు చేపడతామన్నారు. 37 వ డివిజన్ ఎంఎం నగర్ లో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారుడి ఆహ్వానం మేరకు ఆ ఇంటిని ప్రారంభించారు. అదే విధంగా నిర్మాణంలో ఉన్న పలు గృహాలను ఆమె పరిశీలించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలన పేరిట దరఖాస్తులు స్వీకరించి అర్హులైన వారికి ఇల్లు మంజూరు చేస్తామని తెలియజేయడం జరిగిందని అదే క్రమంలో వరంగల్ (తూర్పు) నియోజకవర్గానికి కేటాయించిన 3,500 ఇళ్లలో అర్హులైన లబ్ధిదారులకు కేటాయించామన్నారు. ఎల్–2 లో ఉన్నవాళ్లు స్థలం లేని వారని వారికి కూడా డబుల్ బెడ్ రూమ్ ఇల్లు మంజూరు చేస్తామన్నారు. కార్పొరేటర్ లతో చర్చించి వారి అవసరాలను గుర్తించి ప్రస్తుతం కోట్లాది రూపాయల నిధులను వివిధ అభివృద్ధి పనులకు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇంకా అభివృద్ధి కార్యక్రమాలకు నిధులను మంజూరు చేసే ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందన్నారు. త్వరలో మరిన్ని శంకుస్థాపనలు చేయడానికి వస్తామన్నారు. ఈ నేపథ్యంలో కొత్త సమస్యలను కూడా స్థానికులు తమ దృష్టికి తీసుకురావడం జరుగుతుందన్నారు.

ఎయిర్ పోర్టు సమస్య దాదాపు పరిష్కారమైందన్నారు. జనవరి మొదటి లేదా రెండో వారంలో ముఖ్యమంత్రి నగరానికి వివిధ ప్రారంభోత్సవాలకు వస్తారని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. వరంగల్ సమీకృత కలెక్టర్ కార్యాలయం నిర్మాణం పూర్తయిందని వీటితో పాటు నగరంలో పెండింగ్ లో ఉన్న సమస్యలను గుర్తించి ముఖ్యమంత్రిని ఆహ్వానించి వరంగల్ తూర్పు నియోజకవర్గంలో వారిచే అట్టి కార్యక్రమాలను ప్రారంభిస్తామని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. అంతకు ముందు మధ్య కోట యాదవ వాడ ప్రాంతంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయి నిర్మాణం కొనసాగుతున్న వాసరం హరిత ఆహ్వానం మేరకు ఆ ఇంటిని మంత్రి పరిశీలించి నిర్మాణ తీరును పరిశీలించి లబ్ధిదారుకు శుభాకాంక్షలు తెలిపారు. బల్దియా పరిధిలోని 38 వ డివిజన్ లో స్టాంప్ డ్యూటీ నిధులు రూ.30 లక్షల అంచనా వ్యయం తో ఫోర్ట్ వరంగల్ లో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

అదే విధంగా ఎస్ డీఎఫ్ నిధులు రూ.15 లక్షల అంచనా వ్యయంతో యాదవ వాడ మధ్య కోటలో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. బల్దియా పరిధి 38 వ డివిజన్ లో బల్దియా సాధారణ నిధులు రూ.73 లక్షల వ్యయం తో నిర్మించిన మున్నూరు కాపు సంఘ భవనం (మహిళా కమ్యూనిటీ హాల్) ను మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ సుధారాణి, కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, డీఆర్ఓ విజయ లక్ష్మీ, కార్పొరేటర్ లు బైరబోయిన ఉమా దామోదర్ యాదవ్, భోగి సువర్ణ సురేష్, బస్వరాజు కుమార స్వామి, కావేటి కవిత, ఎస్ఈ సత్యనారాయణ, ఏసీపీ శుభమ్ తదితరులు పాల్గొన్నారు.

## రూ. కోటితో ఈద్గా అభివృద్ధి..

ఖిలా వరంగల్ ఈద్గా అభివృద్ధి కోసం ప్రభుత్వం మంజూరు చేసిన కోటి రూపాయల నిధులతో చేపట్టనున్న పనులకు రాష్ట్ర మంత్రి కొండా సురేఖ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ గతంలో తాను వరంగల్ తూర్పు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే ఈద్గా అధ్యక్షుడు మహమ్మద్ అబ్దుల్ జబ్బర్ ద్వారా అభివృద్ధి పనులపై మెమోరండం అందిందని తెలిపారు. గతంలో ఎవరూ చేయని విధంగా ఈద్గాను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. కబరస్తాన్ పరిసరాల్లో చెట్లు, పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో పండుగల సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వాటిని తొలగించి శుభ్రం చేయిస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్పొరేటర్లు, ఈద్గా మజీద్ కమిటీ సభ్యులు ఎంఎ.జబ్బర్, ఎండి చాంద్ పాషా, ఎండి అల్లావుద్దీన్ సంజరి, మిర్జా హసన్ అలీ బెగ్, ఎండి మ్యాషూక్, ఎండి ముఖబీర్, యాకుబ్, మోయిన్, సాదిక్, అష్రాఫ్, సలీం, మహబూబ్ జానీ, షర్ఫుద్దీన్, రబ్బాని, అజ్జు, దస్తగీర్, ఇబ్రహీం, అంకుష్ తదితరులు పాల్గొన్నారు.

# స్మార్ట్ సిటీ ప్రాజెక్టుల ద్వారా.. సామాజిక న్యాయం

- పార్లమెంట్ లో ప్రశ్నించిన ఎంపీ డా.కడియం కావ్య
- సమాధానం ఇచ్చిన కేంద్ర మంత్రి తోఖాన్ సాహు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ స్మార్ట్ సిటీ ప్రాజెక్టుల అమలు కేవలం మౌలిక సదుపాయాలకే పరిమితం కాకుండా, సామాజిక న్యాయం, సమాన అభివృద్ధి దిశగా సాగాలని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య స్పష్టం చేశారు. ముఖ్యంగా ఎస్సీ వర్గాలకు అందుబాటు ధరల్లో గృహాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. అదేవిధంగా, నగరాభివృద్ధి ప్రణాళికల్లో ప్రజల ప్రత్యక్ష భాగస్వామ్యం ఉండాలని, వార్డు స్థాయి సమావేశాలు, ప్రజాభిప్రాయ సేకరణ, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా పౌరుల సూచనలు తీసుకోవడం అవసరమని ఎంపీ పేర్కొన్నారు. వరంగల్‌ను ప్రజల అవసరాలకు అనుగుణంగా, సమగ్రంగా అభివృద్ధి చేసే బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని, ఈ దిశగా స్పష్టమైన చర్యలు తీసుకోవాలని వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు వరంగల్‌లో సమగ్ర, సమాన అభివృద్ధి జరగాలంటే మౌలిక వసతులతో పాటు అందరికీ అందుబాటులో గృహాలు, ప్రజల భాగస్వామ్యంతో నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య స్పష్టం చేశారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణాల్లో సామాజిక–ఆర్థిక అసమానతలు తగ్గించడమే తన లక్ష్యమని ఎంపీ పేర్కొన్నారు. వరంగల్ నగరంలో అమలవుతున్న స్మార్ట్ సిటీ కార్యక్రమాల స్థితిగతులు, షెడ్యూల్డ్ కాస్ట్ వర్గాలకు అందుతున్న అఫర్డబుల్ హౌసింగ్ చర్యలు, అలాగే నగర ప్రణాళికలో ప్రజల భాగస్వామ్యం అంశాలపై వరంగల్ లోక్‌సభ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిని పార్లమెంట్‌లో ప్రశ్నించారు.

వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర గృహనిర్మాణం, పట్టణ వ్యవహారాల సహాయ మంత్రి తోఖాన్ సాహు సమాధానమిస్తూ, తెలంగాణ రాష్ట్రం నుంచి గ్రేటర్ వరంగల్, కరీంనగర్ స్మార్ట్ సిటీస్ మిషన్ కు ఎంపికయ్యాయని తెలిపారు. డిసెంబర్ 1,2025 నాటికి గ్రేటర్ వరంగల్‌లో మొత్తం రూ.1,800 కోట్ల వ్యయంతో 119 ప్రాజెక్టులు చేపట్టగా, అందులో రూ.1,498 కోట్ల విలువైన 103 ప్రాజెక్టులు (87 శాతం) పూర్తయ్యాయని, మిగిలిన రూ.302 కోట్ల విలువైన 16 ప్రాజెక్టులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని వెల్లడించారు. ఎస్సీ వర్గాల కోసం గృహాల అంశంపై మంత్రి స్పందిస్తూ, భూముల కేటాయింపు, కాలనీల అభివృద్ధి రాష్ట్రాల పరిధిలోని అంశమని, ఆయా రాష్ట్రాలు తమ ప్రజల అవసరాలకు అనుగుణంగా పథకాలు అమలు చేస్తున్నాయని తెలిపారు. స్మార్ట్ సిటీస్ మిషన్ మొత్తం నగర అభివృద్ధి కాకుండా, ఏరియా ఆధారిత అభివృద్ధి విధానాన్ని (రిట్రోఫిట్టింగ్, రీడెవలప్‌మెంట్, గ్రీన్‌ఫీల్డ్, పాన్–సిటీ స్మార్ట్ సొల్యూషన్స్) అనుసరిస్తుందని స్పష్టం చేశారు. ఇది ఇతర ప్రాంతాలకు ఆదర్శంగా నిలిచే అభివృద్ధి నమూనాలను రూపొందించడమే లక్ష్యంగా ఉందన్నారు. ప్రజాభాగస్వామ్యంపై మంత్రి వివరిస్తూ, ప్రతి నగరంలో స్థానిక అవసరాలను దృష్టిలో పెట్టుకొని స్మార్ట్ సిటీ ప్రపోజల్స్ రూపొందిస్తారని, ఇందుకు ప్రజలు, నిపుణులు, వివిధ వర్గాల ప్రతినిధులతో సంప్రదింపులు జరుపుతారని చెప్పారు. ప్రతి స్మార్ట్ సిటీలో స్మార్ట్ సిటీ అడ్వైజరీ ఫోరం ఏర్పాటు చేస్తారని, ఇందులో జిల్లా కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యే, మేయర్, ఎస్పీవీ సీఈఓ, యువత ప్రతినిధులు, సాంకేతిక నిపుణులు సభ్యులుగా ఉంటారని తెలిపారు.

# ప్రధాని మోడీకి మరో గౌరవం

## 'ఆర్డర్ ఆఫ్ ఒమన్' పురస్కారం ప్రదానం

**వరంగల్ వాయిస్, న్యూఢిల్లీ :** భారత ప్రధాని నరేంద్ర మోదీకి అంతర్జాతీయ స్థాయిలో మరో అరుదైన గౌరవం దక్కింది. బుధవారం ఇథియోపియా అత్యున్నత పురస్కారాన్ని అందుకున్న ప్రధాని మోదీ.. మరుసటి రోజే మరో అరుదైన ఘనతను దక్కించుకున్నారు. ఒమన్ దేశం కూడా తన అత్యున్నత పౌర పురస్కారంతో ప్రధాని మోదీని గౌరవించడం విశేషం. ప్రధాని మోదీ తన మూడు దేశాల పర్యటనలో భాగంగా చివరిగా ఒమన్‌లో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య పలు ఒప్పందాలు ఖరారయ్యాయి. భారత్, ఒమన్ దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడంలో చేసిన కృషికి గుర్తింపుగా ఒమన్ సుల్తాన్ హైతం బిన్ తారిక్.. మోదీకి 'ఆర్డర్ ఆఫ్ ఒమన్' పురస్కారాన్ని ప్రదానం చేశారు. 'ఆర్డర్ ఆఫ్ ఒమన్' అనేది ఒమన్, విదేశీయులకు ఇచ్చే అత్యంత విశిష్టమైన పౌర పురస్కారం. భారత్ ఒమన్ దేశాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 70 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మోదీ ఒమన్‌లో పర్యటిస్తున్నారు. కాగా, ప్రధాని మోదీ ఇప్పటివరకు వివిధ దేశాల నుంచి 29 అత్యున్నత పౌర పురస్కారాలను అందుకున్నారు. ఇటీవల కువైట్ ప్రభుత్వం కూడా 'ఆర్డర్ ఆఫ్ ముబారక్ అల్ కబీర్'తో ఆయనను గౌరవించింది. బుధవారం ఇథియోపియా తన అత్యున్నత పురస్కారమైన 'నిషాన్ ఆఫ్ ఇథియోపియా'తో ప్రధాని మోదీని సత్కరించింది.

# సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మాస శివరాత్రి సందర్భంగా హనుమకొండలోని సాయిబాబా మందిరంలో గురువారం మందిర పూజారులు కిషోర్ శర్మ, మణిశర్మ, చందు ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో రుద్ర హోమం నిర్వహించారు. అలాగే ధనుర్మాసాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. ఉదయం నుంచే మందిరానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి సాయిబాబాను దర్శించుకున్నారు. పూజా కార్యక్రమాలు ఆధ్యాత్మిక వాతావరణంలో శాంతియుతంగా సాగాయి. ఈ కార్యక్రమంలో మందిర చైర్మన్ మతుకుమల్లి హరగోపాల్, ధర్మకర్తలు నిమ్మల శ్రీనివాస్, పూస సురేష్ కుమార్, రాకం సదానందం, మందిర వైద్యులు ఆకుల వెంకటరమణయ్య దంపతులు తదితరులు పాల్గొని ప్రత్యేక పూజల్లో భాగస్వాములయ్యారు. కార్యక్రమం ముగింపులో అన్నప్రసాద వితరణ నిర్వహించి భక్తులకు సేవలందించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com